క్లుప్తంగా

ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన శ్రీనివాసరావు



హైదరాబాద్‌లో ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన గన్నవరపు శ్రీనివాసరావు

మామిడికుదురు: హైదరాబాద్‌లో ఎంపీ మిథున్‌రెడ్డిని, మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఆదివారం మర్యాద పూరకంగా కలిశారు. నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితులపై కాసేపు చర్చించారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

పి.గన్నవరం: ముంగండ గ్రామంలోని మంత్రవాది ఇందిరా కుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉదయం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు. వేమగిరికి చెందిన పరమ హంస యోగానంద కంటి ఆస్పత్రి వైద్య బృందం సేవలు అందిస్తారన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారన్నారు. ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాగేశ్వరరావు ప్రజలకు సూచించారు.

వంశవృక్షం పుస్తక ఆవిష్కరణ

మామిడికుదురు: కొమ్ముల వంశస్థుల వంశవృక్షం పుస్తకం ఆవిష్కరణ పెదపట్నంలంకలో ఆదివారం ఘనంగా జరిగింది. కొమ్ముల వెంకటరెడ్డి నాయుడు (దత్తుడు) వారసులతో కూడిన వంశ వృక్షం పుస్తకాన్ని వారి మునిమనవల సమక్షంలో కొమ్ముల స్వామి నాయుడు (తాతాజీ) పాత మండువా లోగిలిలో ఆవిష్కరించారు. ఈ పుస్తకం బంధుత్వాలు, అనుబంధాలను గుర్తు చేసుకునేందుకు భవిష్యత్తు తరాలకు దిక్సూచిగా నిలుస్తుందన్న ఉద్దేశ్యంతో ఈ బృహత్తర కార్యక్రమం చేపట్టామని బసవయ్యనాయుడు పేర్కొన్నారు. కార్యక్రమంలో రామయ్యనాయుడు, సర్వారాయుడు తదితరులు పాల్గొన్నారు.

మెగా కంటి వైద్య శిబిరం

మలికిపురం: మండలంలోని తూర్పుపాలెంలో మెగా కంటి వైద్య శిబిరం జరిగింది. కంటి పరీక్షల అనంతరం పలువురిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. అలాగే ఎంపిక చేసిన సుమారు 60 మందికి ఆదివారం ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుల్లింక మురళీ వెంకట సత్యనారాయణ పాల్గొని నిర్వాహకులను అభినందించారు. సొసైటీ అధ్యక్షుడు యేనుముల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై పోరాటం



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరీదేవి

మామిడికుదురు: అంబేడ్కర్ వాది నల్లి శ్రీనివాస్ ఎన్నో సామాజిక అంశాలపై తిరుగులేని పోరాటం చేశారని, ఆయన చేసిన పోరాటాల వల్లే అంతర్జాతీయ అవార్డు వచ్చిందని మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, టొలాసో మెక్సికో యూనివర్సిటీ (అమెరియా) కో–ఆర్డినేటర్ కె.శంకర్ అన్నారు. ఈదరాడకి చెందిన నల్లి శ్రీనివాస్ ఇటీవల బీఆర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఈదరాడలో ఆదివారం శ్రీనివాస్ దంపతులను ఘనంగా సత్కరించారు. ఆయన చేసిన పోరాటాలను గుర్తుచేశారు. ప్రముఖ న్యాయవాది సరెళ్ల ఆనందశాస్త్రి అధ్యక్షతన జరిగిన సభలో బత్తుల రాము, బొంతు మణిరాజు, కలిగితి పళ్లంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ట్రస్ట్ చైర్మన్‌గా అప్పారావు



ఆలమూరు: మండలంలోని చింతలూరులో ఉన్న శ్రీనూకాంబిక అమ్మవారి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా వీరి అప్పారావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ధార్మిక పరిషత్ కార్యదర్శి కె.రామచంద్రమోహన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఈఓ ఉండవల్లి వీర్రాజు చౌదరి ఆదివారం విలేకరులకు తెలిపారు. చైర్మన్ అప్పారావుతో పాటు కార్యవర్గ సభ్యులుగా గన్ని వెంకట్రావు, అత్తిలి దుర్గమ్మ, నందూరి మోహన్ సుభాష్, చర్ల పుష్పవల్లి, కాలా సూరిబాబు, సంగడి శ్రీదేవి, పూడూరి శ్రీనివాస్, వెల్ల మంగాయమ్మ, పసుపులేటి వీరబాబు, కడలి సత్యవతి నియమితులైన వారిలో ఉన్నారు. అలాగే ఆలయ అర్చకుల కోటాలో లేగా శ్రీనివాస్ నియామకం జరిగింది.

వేద స్మరణతో మానసిక ఉల్లాసం

అయినవిల్లి: సనాతనధర్మాన్ని వేదం సారాల ద్వారానే తెలుసుకోవచ్చని, వేదస్మరణ, పఠనతో మానసిక ఉల్లాసం అలవడుతోందని, తద్వారా భగవంతున్ని చేరుకోవచ్చని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకుడు సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ అన్నారు. ఆదివారం నల్లచెరువులో అంతర్జాతీయ శ్రీకృష్ణమందిరంలో ఈ కృష్ణునికి విశేష అభిషేకాలు, పూజలు జరిపారు. ఆయన మాట్లాడుతూ, వేద శాస్త్రాలు ఏం చెబుతున్నాయో అవే మానవులు ఆచరించాలన్నారు. భగవంతుడు ఒక్కరే ఉన్నారని, ఆయన్నే సమస్త ప్రాణకోటి పూజించాలన్నారు. ఆయన సేవలోనే ప్రతి ఒక్కరూ తరించాలన్నారు. ఆయనే శ్రీకృష్ణ భగవానుడు అని పేర్కొన్నారు.

యూరియా కరవాయె!

- ఖరీఫ్ సీజన్‌లో అరకొరగా పంపిణీ
- అంతంత మాత్రంగా ఎరువుల సరఫరా
- బ్లాక్ మార్కెట్‌పై రైతన్నకు బానటగా
- రేపు వైఎస్సార్ సీపీ 'అన్నదాత పోరు'



గంటిలో ఉన్న రైతు సేవా కేంద్రం

కొత్తపేట: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో యూరియా కొరత రైతులను తీవ్రంగా కలవరపెడుతుంది. ప్రభుత్వం అవసరం మేరకు యూరియా దిగుమతి చేయకుండా అరకొర సరఫరాతో వ్యవసాయ, ఉద్యాన (వాణిజ్య) పంటలకు యూరియా దొరక్క ఆయా పంటలు సాగు చేస్తున్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ, అనుబంధ శాఖల రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, మార్కెటింగ్ సేవలన్నీ పారదర్శకంగా రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల ఇంటి వద్దకే అందించింది. కానీ, కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ సేవలకు మంగళం పాడింది.

ఆచరణలో శూన్యం

పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల పరిధిలోని అనేక మండలాల్లో యూరియా కొరత తీవ్రంగా ఉంది. ఒక్కో మండలంలో ఒకటి, రెండు రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కే) వద్ద అరకొరగా ఉండగా.. మిగిలిన ఆర్ఎస్‌కేల్లో యూరియా నిల్వ బ్యాలెన్స్‌లో ఉంది. అలాగే ఒకటి, రెండు పీఏసీఎస్‌లలో మాత్రమే యూరియా ఉంది. డీలర్ల వద్ద యూరియా పూర్తిగా లేదు. కొత్తపేట మండలంలోని ఆర్ఎస్‌కేల్లో, సొసైటీల్లో గాని ఎక్కడా యూరియా లేదని స్థానికులు అంటున్నారు. 15 మంది డీలర్లు ఉండగా.. కేవలం ఇద్దరు డీలర్ల వద్ద, మన గ్రోమోర్ సెంటర్‌లో మాత్రమే స్వల్పంగా యూరియా ఉంది. ఆత్రేయపురం మండలంలోని రెండు ఆర్ఎస్‌కేల్లో మాత్రమే యూరియా ఉందని చెబుతున్నారు. సొసైటీల్లో, ప్రైవేట్ డీలర్ల వద్ద యూరియా లేదు. ర్యాలి, లొల్ల సొసైటీలకు 40 టన్నుల యూరియా దిగుమతి అవుతుందని అధికారులు చెప్పారు. రావులపాలెం మండలంలో ఆర్ఎస్‌కేలు, సొసైటీలు, డీలర్ల వద్ద యూరియా లేదని రైతులు తెలిపారు. మొదటి, రెండు దఫాలకు యూరియా కొరత లేకుండా స్టాకులు పెట్టామని, మూడో దఫాకు సంబంధించి దిగుమతికి చర్యలు తీసుకున్నామని అధికారులు చెబుతున్నారు. కానీ, ఆచరణలో మాత్రం శూన్యమని రైతులు వాపోతున్నారు.

అమ్మ పెట్టదు.. అడుక్కోనివ్వదు

ఎరువులు విషయంలో అమ్మ పెట్టదు.. అడుక్కోనివ్వదు.. అన్న చందంగా ప్రభుత్వ తీరు ఉందని పలువురు రైతులు వాపోతున్నారు. అవసరమైన ఎరువులను ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఆర్ఎస్‌కేలకు సరఫరా చేయని ప్రభుత్వం, ప్రైవేట్ డీలర్లకు స్వేచ్ఛగా విక్రయించుకునే అవకాశం కల్పిచట్లేదంటున్నారు. ఒక పక్క ఖర్చులు కలుపుకొని విక్రయించుకోవచ్చని చెబుతూనే.. మరో వైపు అధికారులతో దాడులు చేయిస్తుందని మండిపడుతున్నారు. ఆర్ఎస్‌కేలు, సొసైటీల్లో యూరియా బస్తా రూ.267కు విక్రయిస్తుండగా ప్రైవేట్ డీలర్లు రూ.300 వరకూ విక్రయించారు. ఈ తేడా ఏమిటి? అంటే ప్రైవేట్ డీలర్లకు రవాణా ఖర్చులు అదనపు భారం అవుతున్నందున ప్రభుత్వమే రూ.30 పెంచి అమ్ముకునే అవకాశం కల్పించిందని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఓ సందర్భంగా విలేకరుల సమావేశంలో స్వయంగా ప్రకటించారని డీలర్లు చెబుతున్నారు. అధిక ధరలు, స్టాక్ రికార్డులు, గోడౌన్‌లో ఉన్న వాటికి మధ్య తేడాలంటూ కేసులు నమోదు చేస్తున్నారని, దీంతో యూరియా విక్రయాలు మానేశామని ప్రైవేటు డీలర్లు తెలిపారు. హోల్‌సేల్ డీలర్లు యూరియా కావాలంటే గుళికలో లేదా మరొకటో లింకు పెడుతున్నారని, యూరియా దిగుమతి చేయకపోవడానికి ఇదో కారణమని డీలర్లు పేర్కొన్నారు. ఈ విధంగా అవసరం మేరకు ప్రభుత్వం ఆర్ఎస్‌కేలకు యూరియా సరఫరా చేయక, డీలర్ల వద్ద దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రేపు ఆర్డీఓ కార్యాలయాల వద్ద నిరసన

ఎరువులు బ్లాక్ మార్కెట్, యూరియా కొరతపై రైతులకు బాసటగా వైఎస్సార్ సీపీ ఈ నెల 9న అన్నదాత పోరు పేరిట ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టింది. యూరియ సహా రైతులకు అవసరమైన ఎరువులు వెంటనే సరఫరా చేయాలని, బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాలని, ఎరువులను పక్కదోవ పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆర్డీఓ కార్యాలయాల వద్ద నిరసన, వినతిపత్రం సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆ మేరకు మాజీ ఎమ్మెల్యే, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఎరువులు లేక ఇబ్బంది పడుతున్నాం



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆర్‌బీకేల ద్వారా అవసరమైన ఎరువులు లభ్యమయ్యేవి. ఈ ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయానికి యూరియా లభ్యం కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. సీజన్ మొదట్లో ఆర్ఎస్‌కేల ద్వారా అరకొరగా ఇచ్చారు. ప్రస్తుతం యూరియా దొరకడం లేదు. డీలర్ల దగ్గరకు వెళితే లేదంటున్నారు. ఒకరు, ఇద్దరి వద్ద ఉన్నా యూరియాతో పాటు మరొకటి అంటగడుతున్నారు. యూరియా సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కారించాలి. అవసరం మేరకు సరఫరా చేయాలి.

– పెదపూడి బాపిరాజు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షుడు, కొత్తపేట.

యూరియా లేక అమోనియా వేస్తున్నాం



నేను 8 ఎకరాల్లో అరటి, కంద, పసుపు, బొప్పాయి పంటలు సాగు చేస్తున్నాను. ఆర్ఎస్‌కేలు, ప్రైవేట్ డీలర్ల వద్దకు వెళ్లినా యూరియా లేదంటున్నారు. దాంతో ఆయా పంటలకు యూరియా స్థానంలో అమోనియా వేస్తున్నాం. యూరియా రూ.300 కాగా, అమోనియా రూ.700 అంటే అదనంగా రూ.400 భారం పడుతుంది. ఎరువులు లేక ఇబ్బంది పడుతున్నాం..

ముదునూరి రామరాజు, రైతు, వెదిరేశ్వరం, రావులపాలెం మండలం.

రైతులను మోసం చేస్తున్న కూటమి



చొప్పెల్లలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమంలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

- వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన ధ్వజం
- యూరియా కొరతపై స్పందించట్లేదని విమర్శ

ఆలమూరు: రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా కూటమి ప్రభుత్వం పబ్బం గుడుపుకుంటుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీపీ తోరాటి లక్ష్మణ రావు అన్నారు. మండలంలోని చొప్పెల్లలో ఆదివారం జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి అధ్యక్షతన బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నేతలు పాల్గొని ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేయకుండా ప్రచారం చేసుకుంటున్న తీరును ఎండగట్టారు. జిల్లా వ్యాప్తంగా రైతులందరూ యూరియా కొరతను ఎదుర్కొంటున్నా ప్రభుత్వం స్పందించట్లేదని దుయ్యబట్టారు. కూటమి నేతలందరూ యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించారనే ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు, గత వైఎస్సార్ సీపీ హయాంలో కుల, మతాలు, పార్టీలకతీతంగా మేలు చేస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులోకి పక్షపాత వైఖరిని అవలంభిస్తుందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఏ విధంగా నిర్వీర్యం చేస్తుందన్న విషయాన్ని క్యూఆర్ కోడ్ ద్వారా వైఎస్సార్ సీపీ నేతలు గ్రామస్తులకు వివరించారు.

రైతు పోరుబాటను విజయవంతం చేయాలి

జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పిలుపు మేరకు ఈ నెల 9న కొత్తపేట ఆర్డీఓ కార్యాలయం వద్ద నిర్వహించే రైతు పోరుబాటను విజయవంతం చేయాలని మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, మండల రైతు విభాగం అధ్యక్షుడు ఉండమట్ల భాస్కరరావు కోరారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఎలాంటి ఎరువుల కొరత లేదన్న విషయాన్ని వారు గుర్తుచేశారు. రైతులు, అభిమానులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ నేతలు నామాల శ్రీనివాసు, నాంద్ర నాగమోహన్‌రెడ్డి, తోరాటి గోవిందు తదితరులు పాల్గొన్నారు

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

అంబాజీపేట: సాధారణంగా సెప్టెంబర్ నెలలో ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతుంటాయి. కానీ, ప్రస్తుతం తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వర్షాకాలం ప్రవేశించి దాదాపు రెండు నెలలు కావస్తున్నా పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గంలోని 11 మండలాల్లో పెద్దగా వానలు పడిన దాఖలాలు లేవు. వేసవిని తలపించేలా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఎండలు ప్రజలను ఠారెత్తిస్తున్నాయి. గత వారం రోజులుగా అంబాజీపేట మండలంలో 38 నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతున్నాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఉక్కపోత ఉండటంతో వృద్ధులు, చిన్నారులు, బాలింతలు, గర్భిణులు అల్లాడిపోతున్నారు. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు కావడంతో మధ్యాహ్నం 12 గంటలకే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి.



పుల్లేటికుర్రులో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి

యథావిధిగా పంటు రాకపోకలు



రేవులో పంటులో వెళ్తున్న ప్రయాణికులు

సఖినేటిపల్లి: నర్సాపురం, సఖినేటిపల్లి మధ్య వశిష్ఠ గోదావరి రేవులో ఆదివారం యథావిధిగా పంటు రాకపోకలు అధికారులు ఆదివారం ఉదయం నుంచి పునరుద్ధరించారు. ఇటీవల పోటెత్తిన వరదల కారణంగా రేవులో ముందస్తు జాగ్రత్తగా రాకపోకలను నిలుపుదల చేశారు. గోదావరి వరద శాంతించడంతో పంటు రాకపోకలు మొదలయ్యాయి. దీంతో ప్రయాణికులకు ఊరట లభించింది.

అవార్డు గ్రహీతకు సత్కారం

ఆలమూరు: మండలంలోని జొన్నాడకు చెందిన కుంగ్‌ఫూ కరాటే మాస్టర్ సత్తిబాబుకు ఘన సత్కారం జరిగింది. ఇటీవల సౌత్ ఇండియా పరిధిలో కుంగ్‌ఫూ మాస్టర్లకు సంబంధించిన పోటీల్లో సత్తిబాబు బోధిధర్మ అవార్డుకు ఎంపికయ్యారు. అందులో భాగంగా కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదివారం గ్రామానికి వచ్చి సత్తిబాబును ఘనంగా సత్కరించారు.

ఉచిత వైద్య శిబిరం

కొత్తపేట: స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రావులపాలెం ఎంబీ హాస్పటల్స్, ఏఎస్ఎల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని రోటరీ క్లబ్ అధ్యక్షుడు సింగులూరి వీరన్న ప్రారంభించారు. ఈ శిబిరంలో ఈసీజీ, బీపీ, షుగర్, యూరిక్ యాసిడ్, వివిధ రక్తపరీక్షలతో పాటు ముఖ్యంగా ఖరీదైన బోన్ మినరల్ డెన్సిటీ (బీడీఎం) ఎముకల సాంద్రత పరీక్ష కూడా ఉచితంగా నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి రాజోలుకు చెందిన గంటి సూర్యనారాయణమూర్తి ఆదివారం రూ.25 వేలు విరాళం అందజేశారు. ఈ డబ్బును ఆలయ ప్రధానార్చకులు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతను ఆలయ వేదపండితులు, అర్చకులు వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

ఘనంగా చండీహోమం

ఐ.పోలవరం: భాద్రపద మాసం పౌర్ణమి ఆదివారం మహా పర్వదినం పురస్కరించుకుని మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో చండీహోమం ఘనంగా నిర్వహించారు. అర్చకులు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తొలుత గణపతి పూజ, మండపారాధన అనంతరం చండీహోమం, పూర్ణాహుతి జరిపారు. ప్రతి నెలా పౌర్ణమి తిథికి భక్తుల గోత్రనామాలతో దేవస్థానం తరఫున చండీహోమం నిర్వహించారు. 91 మంది భక్తులు చండీహోమంలో పాల్గొన్నారు. హోమానికి సంబంధించి ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి.సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆకొండి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆలయం మూసివేత



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని మూసివేస్తున్న దేవస్థానం అర్చకులు

కొత్తపేట: సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం నుంచి మూసివేశారు. మధ్యాహ్నం 1 గంటకు దేవస్థానం సిబ్బంది, అర్చకులు ఆలయాన్ని మూసివేసి తాళాలు వేశారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం 7 గంటలకు ఆలయాన్ని తెరిచి దర్శనం కల్పించనున్నట్లు ఈఓ సూర్యచక్రధరరావు పేర్కొన్నారు.

శనైశ్వర ఆలయం మూసివేత

మండలంలోని మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్వర) స్వామివారి ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం నుంచి మూసివేశారు. మధ్యాహ్నం 12 గంటలకు తైలాభిషేకాలు, దర్శనాలు నిలిపివేసి దేవస్థానం సిబ్బంది, అర్చకులు ఆలయాన్ని మూసివేసి తాళాలు వేశారు. సోమవారం ఉదయం 8 గంటలకు ఆలయాన్ని తెరిచి స్వామివారి దర్శనం కల్పించనున్నట్లు ఈఓ దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు.

వెళ్లిరా.. విఘ్న నాయకా

అయినవిల్లి: మండలంలోని చింతనలంకలో గణేశుని నిమజ్జనాలను ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. డప్పు వాయిద్యాలు, డీజేలకు అనుగుణంగా యువకుల నృత్యాలు చేశారు. అలాగే వెలువలపల్లి, తొత్తరమూడి తదితర గ్రామాల్లో గణేశుని నిమజ్జన వేడుకలను ఘనంగా జరిపారు. అయినవిల్లి తదితర గ్రామాల్లో చవితి ముగింపు ఉత్సవాల్లో భాగంగా అన్నసమారాధనలు నిర్వహించారు.

బైబై గణేష

అంబాజీపేట: గణపతి నవరాత్రులను పురస్కరించుకుని అంబాజీపేట మండలంలో తొమ్మిది రోజులపాటు పూజలందుకున్న వినాయకుడికి ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికారు. అంబాజీపేట పశువుల ఆస్పత్రి ఎదురుగా ఉన్న సత్యసాయి నగర్‌తో పాటు పసుపల్లి, వాకలగరవు తదితర గ్రామాల్లో ఉన్న గణపతి విగ్రహాలను పురవీధుల్లో ఊరేగిస్తూ కౌశికల్లో నిమజ్జనం చేశారు.

పి.గన్నవరం: బోడపాటివారిపాలెంలో శ్రీలక్ష్మీ గణపతి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని ఉత్సవ విగ్రహాన్ని ఆదివారం భక్తులు ఘనంగా నిమజ్జనం చేశారు. తొలుత స్వామి వారిని బ్యాండు మేళాలతో గ్రామంలో ఊరేగించారు. కోలాటం, తీన్‌మార్ వాయిద్యాలతో సందడి చేశారు. అనంతరం పి.గన్నవరం ప్రధాన పంట కాలువలో నిమజ్జనం గావించారు. కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యులు, యూత్ సభ్యులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

గణపతి ఆలయంలో భక్తుల సందడి



బోడపాటివారిపాలెంలో గణేశుని విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

అయినవిల్లి: ప్రసిద్ధి చెందిన అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ప్రధానార్చకులు మాచరి వినాయక రావు ఆధ్వర్యంలో స్వామికి తెల్లవారుజామున మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకదశ, లఘున్యాస పూర్వక అభిషేకాలు, గరిక పూజ వంటి విశేష పూజలు జరిపారు. అర్చకులు స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. సాయంత్రం స్వామికి విశేష సేవలు చేసి ఆలయం మూసివేశారు. ఒక్కరోజు స్వామికి వివిధ పూజ టిక్కెట్లు, అన్నదాన విరాళాల ద్వారా రూ.1,22,608లు ఆదాయం లభించినట్లు ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ అల్లు వెంకట దుర్గ భవాని తెలిపారు.

ముగిసిన నిమజ్జనాలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణపతి నిమజ్జనాలు ముగిశాయి. చంద్రగ్రహణం కావడంతో ఆయా గ్రామాల్లోని మిగిలిన గణనాథుడి మండపాల్లో భక్తులు నిమజ్జన ప్రక్రియను ఆదివారం ముగించారు. భక్తులందరూ ఆనందోత్సాహాలతో నిమజ్జనోత్సవాలు జరుపుకున్నారు. బ్యాండ్ మేళాల మధ్య విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి గౌతమీ గోదావరిలో గణనాథున్ని నిమజ్జనం చేశారు. ఈసందర్భంగా నిర్వాహకులు ఏర్పాటు చేసిన విచిత్ర వేషధారణ, కోలాట ప్రదర్శన, కోయ నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

8న భేతాళ స్వామి ఉత్సవం

అంబాజీపేట: విజయదశమిని పురస్కరించుకొని అంబాజీపేట, మాచవరం శ్రీఅభ్యుదయ శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అక్టోబర్ 8న శ్రీవిజయ భేతాళ స్వామి వాహన ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు దొమ్మేటి వెంకట రామారావు, ఉత్సవ కమిటీ చైర్మన్ శీలం సత్య అర్జున మోహనరావు, సంఘ సభ్యులు తెలిపారు. అంబాజీపేట సంఘ కళ్యాణ మండపం భవనంలో 13 పాలాల సంఘ సమావేశం కార్యదర్శి మట్టపర్తి రాము అధ్యక్షతన ఆదివారం జరిగింది. వారు మాట్లాడుతూ, ఈ నెల 22న భేతాళ స్వామి కలశస్థాపన జరుగుతుందన్నారు. సమావేశంలో ఎంపీపీ వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు శ్యామ్, గౌరవాధ్యక్షుడు బొంతు పెదబాబు, ట్రెజరర్ గుత్తుల పండు, జాయింట్ సెక్రటరీ మట్టపర్తి సత్యనారాయణ, విత్తనాల ఇంద్రశేఖర్, దొమ్మేటి సత్య మోహన్, మట్టపర్తి సోమేశ్వరరావు, దొమ్మేటి సాయికృష్ణ తదతరులు పాల్గొన్నారు.



అంబాజీపేటలో శెట్టిబలిజ సంఘ సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

యూరియా వాడకంపై అవగాహన

జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

అంబాజీపేట: యూరియా కొరతను అధిగమించేందుకు బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు 270 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు చెప్పారు. చిరతపూడి, ఇసుకపూడి గ్రామాల్లో సర్పంచ్‌లు కోట బేబిరాణి, తరపట్ల మోహన్‌సింగ్ బాబురావు అధ్యక్షతన ఏఓ కె.ధర్మ ప్రసాద్ ఆధ్వర్యంలో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. బోసుబాబు మాట్లాడుతూ, జిల్లాకు వచ్చిన యూరియాను ఆయా మండలాల వారీగా పంపిణీ చేశామన్నారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాస్ జీవామృతం, ఘన జీవామృతం, తూటకాడ కషాయం వినియోగంపై రైతులకు వివరించారు.

మలికిపురం మండలంలో

మలికిపురం: మండలంలోని లక్కవరం, గూడపల్లి గ్రామాల్లో ఆదివారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. తహసీల్దారు శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ, యూరియా సరఫరా మీద భరోసా కల్పించారు. అనంతరం నానో యూరియా గూరించి అవగాహన కల్పిస్తూ యూరియా నిల్వలు ఎక్కడ ఎంత ఉందో వివరించారు.

మామిడికుదురు: రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని, ఎటువంటి ఆందోళన చెందవద్దని మండల ప్రత్యేకాధికారి మధుసూదన్, ఏఓ సత్యనారాయణ తెలిపారు. మామిడికుదురులో ఆదివారం రైతులతో యూరియా నిల్వ, వాడకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మామిడికుదురు, ఈదరాడ సొసైటీల ద్వారా యూరియా రైతులకు విక్రయిస్తున్నారని చెప్పారు. వరి పండించే రైతులు ఎకరానికి 70–75 కిలోలు యూరియా వేసుకుంటే సరిపోతుందన్నారు. ఎక్కువ యూరియా వాడకం వల్ల తెగుళ్లు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. మండల పరిధిలో 2,560 ఎకరాల్లో వరి, 8,940 ఎకరాల్లో కొబ్బరి తోటలు సాగుతో ఉన్నాయని చెప్పారు. మొత్తం 773 మెట్రిక్ టన్నులు యూరియా అవసరం కాగా, 355 మెట్రిక్ టన్నులు రైతులకు అందించామని, మరో 70 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని చెప్పారు. ఈ నెలాఖరు నాటికి మరో 100 మెట్రిక్ టన్నులు దిగుమతి అవుతుందన్నారు.



నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఏఓ బోసుబాబు

లభ్యతపై సమావేశాలు

సఖినేటిపల్లి: రామేశ్వరం, సఖినేటిపల్లి గ్రామాల్లో ఆదివారం యూరియా లభ్యతపై ఫార్మర్ ఔట్ రీచ్ ప్రోగ్రాం నిమిత్తం అధికారులు సమావేశాలు ఏర్పాటు చేశారు. మండల ఏవో రాకేష్ మాట్లాడుతూ, యూరియా కొరత లేదని, రైతులకు కావాల్సిన యూరియా సరఫరా చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మండలంలో ప్రస్తుతం 20 టన్నుల యూరియా సిద్ధంగా ఉందన్నారు.

అయినవిల్లి: మండలంలోని రైతులకు 62 మెట్రిక్ టన్నులు యూరియా అందుబాటులో ఉంచినట్లు మండల ప్రత్యేక అధికారి వెంకటరామారావు తెలిపారు. ఆదివారం నేదునూరు సొసైటీ కార్యాలయం వద్ద పీఏసీఎస్ చైర్‌పర్సన్ వర్రే శ్రీనివాసరావు అధ్యక్షతన రైతులతో సమావేశం నిర్వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, మండలంలోని పోతుకుర్రులో 20 మెట్రిక్ టన్నులు, అయినవిల్లిలో 20 మెట్రిక్ టన్నులు, నేదునూరు సొసైటీలో 22 మెట్రిక్ టన్నులు మొత్తం 62 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచామని ఆయన తెలిపారు. కాకినాడ పోర్టులో 30వేల మెట్రిక్ టన్నులు యూరియా అందుబాటులో ఉందన్నారు. అలాగే నానో యూరియాను రైతులు వినియోగించుకోవచ్చని ఆయన సూచించారు.

పేద విద్యార్థులకు నగదు ప్రోత్సాహాలు

మామిడికుదురు: హుస్సేనీ ఎడ్యుకేషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 25 మంది పేద విద్యార్థులకు నగదు ప్రోత్సాహాలు, 100 మందికి రాత పుస్తకాలు, విద్యా సామాగ్రిని అందజేశారు. మామిడికుదురులో జరిగిన సమావేశంలో మీర్జా ఖాదం హుస్సేన్ మాట్లాడుతూ, 53 ఏళ్ల నుంచి హుస్సేనీ ఎడ్యుకేషనల్ అసోసియేషన్ విద్యాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. పదో తరగతిలో 500 మార్కులు దాటిన వారికి, ఇంటర్‌లో 900 మార్కులు వచ్చిన వారికి దుర్హమ్ తఖీ హైదర్ ఖాషానీ స్మారకార్థం రిజ్వానుల్ హసన్ మెమెంటోలు అందించారు. డీఎస్సీలో అర్హత సాధించిన ముస్లిం అభ్యర్థులను సత్కరించారు. హుస్సేనీ ఎడ్యుకేషనల్ అసోసియేషన్ అందిస్తున్న సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో సయ్యద్ ఆగా హుస్సేన్, కల్బే ఆబేద్ మాజింద్రాణి, ఎండీ అలీ బేగ్, అలీ అక్తర్, ఎండీ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ముంపునకు గురైన జాతీయ రహదారి



మామిడికుదురులో జాతీయ రహదారిపై నిలిచిన ముంపు నీరు

మామిడికుదురు: మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. తీవ్రమైన వేడి, ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు భారీ వర్షంతో సేద తీరారు. గంటపాటు కురిసిన వర్షానికి పలుచోట్ల రోడ్లపై భారీగా ముంపు నీరు నిలిచిపోయింది. మామిడికుదురు, నగరం గ్రామాల్లో 216 జాతీయ రహదారిపై మూడడుగుల మేర వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. బోయి భీమన్న మానవ వనరుల కేంద్రం, పాత పోలీస్ స్టేషన్ సమీపంలోనూ ముంపు నీరు నిలిచిపోయింది. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.